




# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 1 2025 | సంపుటి :0 | సంచిక :227 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా: బండి సంజయ్



భారాస ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. 2 లో

## ఆపరేషన్ సిందూర్‌పై మేం రాజకీయం చేయడం లేదు:



2 లో

# రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు కమిటీ



- పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేయండి
- కళాశాలలు, దేవాలయ భూముల్లో పరిశీలించండి
- తగిన విధంగా బడ్జెట్ రూప కల్పన
- అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో శనివారం సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. గడువులోగా కమిటీ- పూర్తిస్థాయి ప్రణాళికతో ఉండాలని సిఎం ఆదేశం ఇచ్చారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా, వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని, అందుబాటులో ఉన్న స్థలాలు గుర్తించాలని కోరారు. కనీసం 50 ఎకరాలకు తగ్గకుండా గోశాలలు ఉండాలని సిఎం అన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు- చేయాలని సూచించారు. ఇందు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు- చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2లో..

# వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం:

- »ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- »ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉంది.
- »దేశంలోని అన్ని వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యం.
- »వెనుకబడిన వర్గాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు.
- »ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం ఈ చట్టం చేసి, 6.70 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసింది.
- »పేదలకు పంచిన భూములను సాగు చేసుకోకుండా అడ్డుకుంది.



## ఎస్సీ వర్గాల పట్ల అలుగు వర్షిణి వివక్ష.. మండిపడ్డ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు అధఃపాతాళానికి వెళ్తున్నాయని బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. సీఎం నిర్లక్ష్యం వల్ల అనేకమంది పేద పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 2లో..

## 'జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లో అవినీతి'.. లింక్డిన్ పోస్ట్‌పై స్పందించిన నిర్మలా సీతారామన్

జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతిపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్ట్‌పై కేంద్రమంత్రి స్పందించారు.




2 లో

## జులైలో పంచాయతీ ఎన్నికలు.. పది రోజుల గ్యాప్ లోనే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు

హైదరాబాద్

2లో..




# కేసీఆర్‌కు ఒక కన్ను భారాస .. రెండో కన్ను జాగృతి సంస్థ



హైదరాబాద్: తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ జాగృతి' నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 1 2025

## భారత ప్రస్థానం: జాలువారిన జ్ఞాపకాలు

గోపాల్‌కృష్ణ గాంధీ జీవన యాత్ర అష్ట పదులలోకి ప్రవేశించనున్నది. 22 ఏప్రిల్ 2020న ట్విట్టర్‌పై (అప్పటికింకా అది Xగా మారలేదు) ఒక థ్రెడ్ (ట్వీట్‌ల పరంపర)ను పోస్ట్ చేశాను. 'మన మధ్య నడయాడుతున్న ఒక విశిష్ట భారతీయుని 75వ జన్మదినోత్సవ సందర్భమిది: ఆ ప్రముఖుడు ప్రజాసేవకుడు, దౌత్యవేత్త, రచయిత, విద్వజ్ఞుడు గోపాల్‌కృష్ణ గాంధీ'. మాతృదేశానికి ఆయన అందించిన సేవలు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సౌహార్ద్రపూర్వకమైన నడవడి గురించి ప్రస్తుతిస్తూ చివరకు ఆయనకు నేను వ్యక్తిగతంగా ఎలా రుణపడి ఉన్నదీ పేర్కొన్నాను. ఆధునిక భారతదేశ చరిత్ర, మహాత్మాగాంధీ గురించి మరెవ్వరి కంటే కూడా ఎక్కువగా ఆయన నాకు బోధించారు'.ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. మరి మూడు రోజుల్లో గోపాల్ 80వ వసంతంలోకి వెళ్లనున్నారు. ఇప్పుడు ఆయన, తన సొంత జీవన ప్రస్థానంతో సమాంతరంగా సాగిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య పురోగతి, తిరోగతిపై ఒక జ్ఞానదాయక గ్రంథాన్ని కానుకగా అందించడం ద్వారా నన్ను (ఇంకా ఎంతో మంది భారతీయులను) మరెంతగానో రుణగ్రస్తుడిని చేసుకున్నారు. తన విస్తృత అధ్యయనం, భారత్ గురించిన ప్రగాఢమైన అవగాహనతో చారిత్రక ఘటనల వృత్తాంతాలతో మేళవించిన వ్యక్తిగత జ్ఞాపకాల విలక్షణ చరిత్ర అది. ఆయన వచనం అద్భుతమైనది. మన ఆలోచనాశీలతను సునిశితం చేసేది, రచయిత స్ఫూర్తిదాయక జీవిత గమనాన్ని, మన రిపబ్లిక్ సమున్నత, సంక్షోభ భరిత ప్రస్థానాన్ని, మునుపెన్నడూ చూడని చాలా అరుదైన ఛాయాచిత్రాలతో సహా అక్షరీకరించిన గ్రంథమది. హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, తమిళ చలనచిత్రాల గురించిన ప్రేమపూర్వకమైన ప్రస్తావనలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యం, వైదుష్యం, ప్రజాసేవతో పాటు సినిమాలు సైతం ఆయన జీవితాన్ని ప్రభావదాయకంగా తీర్చిదిద్దాయన్నది స్పష్టం.గోపాల్ తాజా గ్రంథం Undying Light : A Personal History of Independent India స్వతంత్ర భారత తొలి సంవత్సరాలను, ప్రత్యేకించి మహాత్ముని చివరి నిరాహార దీక్షలు, ఆయన బలిదానం, నెహ్రూ%–%పటేల్ మధ్య విభేదాలు, దేశ హితానికై వారి సమన్వయ కృషి గురించి విశదమైన కథనాలతో ప్రారంభమవుతుంది. ఆ తరువాత కాలక్రమానుసారంగా ప్రతి సంవత్సరం గురించి క్లుప్త, ఉల్లాసకరమైన కథనాలతో కొనసాగి, చివరి దశాబ్దంన్నర కాలం గురించి ఒక ఏకీకృత అధ్యాయంతో ముగుస్తుంది. స్వాతంత్ర్య ఆగమనం, దేశ విభజన తరుణంలో జన్మించిన గోపాల్‌కృష్ణ గాంధీ మన రిపబ్లిక్‌తో పాటు ఎదుగుతూ వచ్చారు. దేశభక్తి ప్రపూరితులైన తల్లిదండ్రులు దేవదాస్ (మహాత్ముని కుమారుడు), లక్ష్మి (రాజాజీ కుమార్తె) ఆయన మేధో పరిణామాన్ని ప్రభావితం చేశారు. తన తోబుట్టువులు తార, రాజ్‌మోహన్, రామచంద్ర గురించి కూడా గోపాల్ అవ్యాజ ప్రేమాదరాలతో రాశారు. ఇంకా వివాదాస్పద ప్రధానమంత్రులు, లోక విఖ్యాతులుకాని ఉపాధ్యాయులు, సంఘ సేవకులు, ఎంతో మంది ఆసక్తిదాయక ప్రభావశీల వ్యక్తుల గురించిన విశేషాలు కూడా మనకు గోపాల్ గ్రంథం ద్వారా తెలుస్తాయి. గోపాల్ తన మాతామహుడు చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ) గురించి సహజంగానే ప్రముఖ ప్రాధాన్యంతో రాశారు. స్వతంత్ర భారతదేశంలో అత్యున్నత పదవిని అధిష్టించిన రాజాజీ, తన రాజకీయ జీవితోన్నతికి బాటలు వేసిన భారత జాతీయ కాంగ్రెస్‌ను విడనాడి 'స్వతంత్ర పార్టీ' అనే ప్రతిపక్షాన్ని వ్యవస్థాపించారు. 'తన జీవితంపై ఏకైక అతి పెద్ద ప్రభావం' తన మాతామహుడేనని గోపాల్ వివరించారు.గోపాల్ పదే పదే ప్రస్తావించిన రెండో వ్యక్తి సాటిలేని సంగీత విదుషీమణి ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి. కుటుంబ స్నేహితురాలు అయిన సుబ్బులక్ష్మి సంగీతం, సమున్నత వ్యక్తిత్వం గోపాల్ జీవితంపై ఒక అజరామరమైన ప్రభావం. ఆయనను బాగా ప్రభావితం చేసిన మూడో వ్యక్తి జయప్రకాశ్ నారాయణ్. ఆయన పరిపూర్ణ చిత్తశుద్ధి, ప్రశాంత వక్తృత్వం, ముఖ వర్చస్సు, అన్నిటినీ మించి ఆయన ఆంగ్ల భాషా గరిమ తనను బాగా ప్రభావితం చేశాయని గోపాల్ రాశారు. భారత్%–%చైనా సంఘర్షణ కాలంలో తన అభిమాని ఆహ్వానంపై జయప్రకాశ్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కళాశాలలో ఒక ఉపన్యాసం వెలువరించారు. 'స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయవాదం అంటే వలసపాలన నుంచి విముక్తికై పోరాడడం, కోల్పోయిన ఆత్మగౌరవాన్ని పునః సాధించుకోవడం, స్వావలంబన అహింసాత్మకంగా శాసనోల్లంఘన చేయడంగా వర్ధిల్లిందని చెప్పారు.

## జులైలో పంచాయతీ ఎన్నికలు.. పది రోజుల గ్యాప్‌లోనే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పంచాయతీ ఎన్నికల నగారా మోగనుంది. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా జులై నెలలో పంచాయతీ ఎన్నికల నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది ప్రభుత్వం.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జూన్ నెలాఖరున ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది ప్రభుత్వం. ముందుగా ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించి.. తరువాత సర్పంచ్ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ సింబల్ తో ఉంటాయి కాబట్టి.. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత పది రోజుల గ్యాప్ లోనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు గతేడాది ఫిబ్రవరిలోనే ముగియగా.. దాదాపు ఏడాదిన్నరగా ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,600 కోట్లకు పైగా ఆగిపోయాయి. పాలకవర్గాలు ఎన్నికైతేనే ఈ నిధులు వస్తాయి. ఇక మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు జులై మొదటి వారంలో.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు గత నెలలోనే ముగిశాయి.

వీటికి కూడా ఫైనాన్స్? కమిషన్ నిధులు ఆగిపోయాయి. ప్రస్తుతం అన్నిచోట్లా ఇన్‌చార్జ్‌ల పాలన నడుస్తున్నది. ఒక అధికారి ఐదారు పంచాయతీలు, మండలాలు లేదా మున్సి పాలిటీలను పర్యవేక్షిస్తుండటంతో అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ పదేండ్ల తర్వాత అధికారంలోకి రావడంతో గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు స్థానిక పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

ముఖ్యంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ లాంటి పదవులు దక్కితే పార్టీ మరింత బలపడుతుందని కాంగ్రె స్ పెద్దలు భావిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో.. జూన్ చివరి వారంలో లేదా జులై మొదటి వారం నుంచి స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

పార్టీ పరంగానే 42% రిజర్వేషన్లు

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలను గతేడాదే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర కుల గణన సర్వే చేపట్టింది. అనంతరం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించింది.

ఇందుకు సంబంధించిన రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల కేంద్ర కేబినెట్ కూడా దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన చేసేందుకు అంగీకరించింది. ఇది పూర్తయ్యేందుకు మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రం చేసిన కుల గణన వివరాల ఆధారంగా పంపిన స్థానిక బీసీ రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండడంతోఈసారి పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఇతర పార్టీలు కూడా బీసీలకు అంతే మొత్తంలో రిజర్వేషన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. దీంతోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు అవుతుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

## కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు. "భారాసలో చార్‌పత్తా ఆట నడుస్తోంది. కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్. భాజపా–భారాస ఎప్పుడూ కలవవు. కవిత అరెస్టు జరగకుండా ఉండేందుకు మా పార్టీతో కలిసేందుకు ప్రయత్నించారు. అవినీతి భారాసతో భాజపా కలవదు. కాంగ్రెస్–భారాస మాత్రమే కలిసి పనిచేశాయి.

వేములవాడ రాజన్న గోశాలలో కోడెలు చనిపోవడం బాధాకరం. ఈ ఘటనపై ఈవోతో మాట్లాడతాను. కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాలను విస్తరించాలి. రాజన్న ఆలయం నిధులను మాజీ సీఎం వేరే చోట ఖర్చు చేశారు. మన సైన్యం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్‌పై యుద్ధం ఇంకా కొనసాగుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు యుద్ధం కొనసాగుతుంది " అని బండి సంజయ్ అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై మేం రాజకీయం చేయడం లేదు: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వాయుసేనకు ఫైటర్ జెట్స్, ఆయుధాలు సరైన సమయానికి అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. "రఫేల్ విమానాలు కూలాయని రాహుల్ చెబితే దేశ వ్యతిరేకులు అన్నారు. రఫేల్ విమానాలు కూలాయని సీడీఎస్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. సీడీఎస్ వ్యాఖ్యలపై ఏం చెప్తారు.. ఆయన్ని దేశ వ్యతిరేకి అంటారా? పాకిస్థాన్ ఫైటర్ జెట్స్ ఎన్ని కూలాయో కూడా స్పష్టం చేయాలి. సరిపడా యుద్ధ విమానాలు లేవు .. ఇది దేశానికి మంచిది కాదు. ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ రాజకీయం చేయడం లేదు. యుద్ధ విషయాలు ప్రపంచానికి బహిరంగంగానే చెప్పాలి. విజయాలతో పాటు లోటుపాట్లను కూడా ప్రజలకు చెప్పాలి" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

## ఎస్సీ వర్గాల పట్ల అలుగు వర్షిణి వివక్ష.. మండిపడ్డ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మొదటిపేజీ తరువాయి



తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

విద్యార్థులు వాళ్ళ టాయిలెట్స్ వాళ్ళు కడుక్కుంటే తప్పు ఏంటని ఒక ఐఏఎస్ అధికారి అంటున్నారు. మరి రేవంత్ రెడ్డి ఇంట్లో టాయిలెట్ రేవంత్ రెడ్డినే కడుగుతున్నారా? మీ మంత్రుల ఇళ్ళల్లో వాళ్ళ టాయిలెట్స్ మంత్రులే కడుగుతున్నారా? మీ పిల్లల స్కూల్లో టాయిలెట్స్ మీ పిల్లలే కడుగుతున్నారా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

ఎస్సీ వర్గాల పట్ల ఐఏఎస్ అలుగు వర్షిణి వివక్ష చూపుతున్నారు. పేద పిల్లలు టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎట్లా చెప్పిస్తారు? గురుకులాల్లో చదువుకునే పిల్లలు సంపన్న వర్గాల నుంచి రాలేదని అలుగు వర్షిణి అంటున్నారు. సంపన్న వర్గాల పిల్లలకు ఒక రూల్, పేద పిల్లలకు ఒక రూల్ ఉందా రేవంత్ రాజ్యాంగంలో. మరి మేము మీ ప్రభుత్వానికి పన్నులు ఎందుకు కట్టాలి? ఇదేనా మీ రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని చెప్తున్న రాజ్యాంగం? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

## 'జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లో అవినీతి'.. లింక్డిన్ పోస్ట్‌పై స్పందించిన నిర్మలా సీతారామన్

మొదటిపేజీ తరువాయి

జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి జరుగుతోందంటూ వచ్చిన సోషల్‌మీడియా పోస్ట్‌పై కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ స్పందించారు. జీఎస్టీ నంబర్‌ను పొందేందుకు తాను 'అవినీతికి' పాల్పడబోతున్నానంటూ ఓ వ్యక్తి చేసిన పోస్ట్ వైరల్‌గా మారిన నేపథ్యంలో ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజా సమస్యలపై సత్వరమే స్పందిచాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. అంతకుముందు కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు కూడా (%జదీ×జ%) కూడా తన స్పందన తెలియజేసింది. ఇంతకీ ఏం జరిగిందంటే.?

జీఎస్టీ రిజిస్ట్రేషన్ గురించి వినోద్ గుప్తా అనే వ్యక్తి లింక్డిన్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తన భార్య, కుమార్తె కలిసి నెలకొల్పిన సంస్థకు జీఎస్టీ నంబర్ కోసం తాను దరఖాస్తు చేశానని, 20 రోజులు దాటినా నంబర్ రాలేదని ఆరోపించారు. అభ్యంతరాలు వస్తున్నా జీఎస్టీ నంబర్ రాలేదని తెలిపారు. జీఎస్టీ నంబర్ పొందడం కోసం తాను లంచం ఇవ్వనున్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

### హారియర్ ఈవీ వచ్చేస్తోంది.. ధర ఇదేనా?

ట్యాక్స్ నిపుణులు అభిషేక్ రాజారామ్ ఈ అంశంపై ఎక్స్ వేదికగా స్పందించారు. వినోద్ గుప్తా పోస్ట్ స్క్రీన్ షాట్‌ను కోట్ చేస్తూ.. జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతి గురించి సీబీఐసీకి తెలీడం లేదని పేర్కొన్నారు. ఉన్నతస్థాయి ఉద్యోగులే జోక్యం చేసుకుని దేశంలోని ఈ అవినీతి నుంచి కాపాడాలంటూ పోస్ట్ పెట్టారు. సీబీఐసీని ట్యాగ్ చేశారు. దీంతో పరోక్ష పన్నుల బోర్డు సత్వరమే స్పందించి వివరణ ఇచ్చింది.

గుప్తా దరఖాస్తు మే 26న ఫైల్ చేశారని, ఇది ఢిల్లీ స్టేట్ జీఎస్టీకి అసైన్ చేశారని పేర్కొంది. అయితే రెంట్ అగ్రిమెంట్‌పై సంతకం చేసిన వ్యక్తికి సంబంధించిన వివరాలను పూర్తిగా పేర్కొనకపోవడంతో దరఖాస్తు పెండింగ్‌లో ఉందని తెలిపింది. ఇదే విషయాన్ని దరఖాస్తుదారుకు కూడా తెలియజేశామని వెల్లడించింది. పెండింగ్ వివరాలు అందితే సంబంధిత అధికారులు ప్రక్రియను పూర్తి చేస్తారని పేర్కొంది. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్యాలు ప్రచారం చేయొద్దని హితవు పలికింది. ఈ పోస్ట్‌పై నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పన్ను చెల్లింపుదారులకు సేవలందించడంతో పాటు వారిని నమ్మకాన్ని చూరగొనడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు తక్షణమే స్పందించాలని సూచించారు.

# రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు కమిటీ

మొదటిపేజీ తరువాయి

నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు– చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ఈ సంద్భంగా సీఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ప్రభుత్వం ఖరారు చేయనుంది. ఈ సమీక్షా సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎం ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మరోవైపు.. వేములవాడ రాజన్న ఆలయంలో కోడెలు మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది. రెండు రోజుల క్రితం దాదాపు ఎనిమిది కోడెలు మృత్యువాత పడగా.. మరో 10 కోడెలు అనారోగ్యంతో బక్కచిక్కిపోయిన ఉన్నట్లు తెలుస్తోంది. రాజన్న భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు స్వామి వారికి కోడెలను అందజేస్తుంటారు. గోశాలలో దాదాపు రెండు వేల వరకు కోడెలు, ఆవులు ఉన్నాయి. కోడెల సంరక్షణ కోసం 11 షెడ్లను ఏర్పాటు– చేశారు. అయితే ఈ షెడ్లలో ఉండాల్సిన వాటికంటే ఎక్కువగా కోడెలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కోడెల సంఖ్యలకు సంబంధించి అధికారులు సరైన సమాధానాలు చెప్పకపోవడం, కోడెలకు ట్యాగ్‌లు లేకపోవడంతో అనేక కోడెలు పక్కదారి పడుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా దేవుడికి మొక్కుగా ఇస్తున్న కోడెలు ఇలా అధికారులు నిర్లక్ష్యం కారణంగా మృత్యువాతపడటం పట్ల భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

మొదటిపేజీ తరువాయి

పాల్వంచ: ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

"వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం చేసింది. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది. 6.70 లక్షల ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. పేదలకు పంచిన భూములను వారు దున్నుకోకుండా భారాస ప్రభుత్వం అడ్డుకుంది. గిరిజనుల భూమికి సాగునీటి కోసం 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించాం. దీనికోసం రూ.12,500 కోట్లు కేటాయించాం. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని భట్టి విక్రమార్క వివరించారు.

## కేసీఆర్‌కు ఒక కన్ను భారాస .. రెండో కన్ను జాగృతి సంస్థ

మొదటిపేజీ తరువాయి



"కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయింది. ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చాం. ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలి.

జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పనిచేస్తాం.. ఒక కన్ను భారాస అయితే, రెండోది జాగృతి సంస్థ. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. యావత్ తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టే. ఈ రాష్ట్రానికి ఆయన ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. మహాధర్నాలో నోటీసుల కుట్ర మొత్తం వివరిస్తాం. గోదావరి–కావేరీ లింకేజీతో నదీ జలాలు తెలంగాణకు శాశ్వతంగా దూరమవుతాయి. బనకచర్ల ద్వారా ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? నదుల అనుసంధానాన్ని కేసీఆర్ వ్యతిరేకించారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. ఇచ్చింపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని కేంద్రం చెప్పింది. జూన్ 2న నదీ జలాలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని డిమాండ్ చేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.

బంజారాహిల్స్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్, కేసీఆర్ ఫొటోలతో తెలంగాణ జాగృతి బ్యానర్ పెట్టారు. కొత్త కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్, ఆచార్య జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే విగ్రహాలతో పాటు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూన్ 1 2025

## సీమ చింతకాయలతో రక్తపోటు దూరం



**గాజెల్లి రాజేంద్ర ప్రసాద్,కోరుట్ల**
సీమ చింతకాయలతో ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.వీటిలో విటమిన్ ఎ, బి, సి, మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.సీమ చింతకాయలను తినడం వల్ల ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు దూరం అవుతాయి. ఇంకా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ముఖ్యంగా రక్తపోటు తగ్గి.. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

## ఘనంగా అహల్యాభాయి హెూల్కర్ జయంతి వేడుకలు



**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
అహల్యాబాయి హెూల్కర్ 300 సంవత్సరాల జయంతి సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ కేంద్రంలో వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ నాయకులు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ మహారాణి అహల్యాదేవిని ఆదర్శప్రాయమైన పాలకురాలు అని న్యాయం, కరుణతో ప్రజలకు సేవ చేసిన వారని, అహల్యాదేవి హెూల్కర్ పాలనను పునర్నిర్వచించారు, సామాన్యులకు న్యాయం చేశారు అన్నారు.

## లోక్ అదాలత్ లతోనే సత్వర న్యాయం

**గాజెంగి మహేశ్వర్, మెటుపల్లి కరపత్రం**
లోక్ అదాలత్ లతోనే సత్వర న్యాయం సమ న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి డి నాగేశ్వర్ రావు అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 14 నా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉందన్నారు.

## బిల్ కలెక్టర్ గా పని చేసిన కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తక్కలపల్లి రాజేశ్వరరావు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 31**
జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వర్తిస్తూ గత అయిదు రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయిన పులాల కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన లిజమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర రావు కుమార్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు కుమార్ చనిపోవటం చాలా బాధాకరం అని తెలిపారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, బి ఆర్ ఎస్ నాయకులు బోగం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## తనువుశాలిస్తూ మరో ఇద్దరికి చూపునిచ్చిన కన్నూరి బుచ్చమ్మ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మే 31**
కన్నూరి బుచ్చమ్మ గాందీ ఆసుపత్రిలో చికిత్స పొందుతు 27.5.2025 రోజున మృతి చెందారు. ఇంతటి బాధాకర సమయంలో సైతం చూపులేని కుటుంబాల్లో వెలుగు నింపాలనే ఆలోచనతో వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడం గొప్ప విషయం. కన్నూరి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు నేత్రదానంపై అవగాహనతో ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఐ బ్యాంక్ పంపడం జరిగింది.ఇద్దరు అంధులకు నేత్రాలను ఇచ్చి చూపును ప్రసాదించింది భర్త కన్నూరి మదనయ్య, కుమారులు మొగిలి, కోటేశ్వర్, సదానందం, కుమార్తె స్వరూపు మరియు బంధు మిత్రులను స్థానిక ప్రజలు, ఐ ఇన్స్టిట్యూట్ వారు అభినందించారు. ఈ సందర్భంగా ఐ ఇన్స్టిట్యూట్ వారు మాట్లాడుతూ ఇంతటి దుఃఖ సమయంలో సైతం కన్నూరి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు మంచి ఉద్దేశంతో పలువురి కుటుంబాల్లో వెలుగు నింపాలనే ఆలోచనతో ముందుకు రావడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. కన్నురి బుచ్చమ్మ కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు రావడం వల్ల అందుల జీవితాల్లో వెలుగు చిగురిస్తుందని అన్నారు.
కన్నూరి బుచ్చమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో నల్లచీమలు కనబడితే దేనికి సంకేతం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఇది మూఢ నమ్మకమా? కాదా అని ఎవరికి వారే తేల్చుకోవాల్సిన విషయం.ఇంట్లో నల్ల చీమలు కనపడడం మనం చూస్తాం.ఇది వాతావరణ ప్రభావమా..లీకానకు అర్థం కాని అంతరార్థం ఎమైనా ఉందా? ఈ విషయం పట్ల పెద్దల వ్యాఖ్యానాలు గమనిద్దాం..పండితులు ఏమంటున్నారో తెలుసుకుందాం.ఇంట్లో అప్పుడప్పుడు ఇళ్లల్లో నల్ల చీమలు కనపడుతూ ఉంటాయి. అయితే వాస్తుశాస్త్రం ప్రకారం ఇంట్లో నల్ల చీమలు కనపడితే మంచిదేనని



పండితులు చెబుతున్నారు. నల్ల చీమలు ఇంట్లో తిరిగితే సంపదకు ఆధిదేవత అయిన శ్రీ మహాలక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందట. బియ్యం బస్తాల దగ్గర తిరిగితే త్వరలో ఐశ్వర్యవంతులు అవుతారట. బీరువా పక్కన కనపడితే వెండి, బంగారం ఇంటికి రాబోతుందని అర్థమట.తెలుసుకున్నారుగా.. ఇక మీ ఇంట్లోకి నల్ల చీమలను ఆహ్వానించండి. నల్ల చీమలు రావడానికి ఏం చెయ్యాలో ఆలోచించండి.లేకపోతే..

- మొన్నా కుట్టేసినాది నిన్నా కుట్టేసినాది
మళ్ళీ కుట్టేసినాది గండు చీమ..

**అని సినిమా పాటేసుకోండి,**
**అంతా శుభమే జరుగుతుంది.**

# విద్యార్థుల సంఖ్య పెంపుకు సహకరించండి

- ప్రభుత్వ పాఠశాల లో చేర్పించడి
- డబ్బ గ్రామంలో ఇంటింటి ప్రచారం

**గాజెంగి మహేశ్వర్,కరపత్రం**
మెటుపల్లి జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని డబ్బ గ్రామంలో శనివారం ముందస్తు బడి బాటలో భాగంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.అనంతరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.పాఠశాల లో ఉన్న మౌళిక వసతులు ,ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత



పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం తదితర అంశాలను వివరించారు.పాఠశాల లో విద్యార్థులు తగ్గుతున్నారని విద్యార్థుల నమోదు కొరకు తమ సహకారాన్ని అందిచాలని గ్రామస్థులందరినీ కోరారు.ఈ



కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ టి రమేష్, మాజీ ఎంపిటిసి దేశెట్టి శాంతిజివన్, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జాన శంకర్, తేలు నరేష్, ఉపాధ్యాయులు, అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం 100 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి.. మున్సిపల్ కమిషనర్ ఎం డీ అయాజ్..

**కరపత్రం ప్రతినిది ప్రతినిధి జమ్మికుంట :మే 31**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుండి 100 రోజుల వరకు ఏర్పాటు చేసిన ప్రతి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు విధిగా కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ పతాక ఆవిష్కరణ మొదలుకొని సెప్టెంబర్ 9వ తేదీ వరకు కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ప్రతి కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు పలు కార్యక్రమాలలో హాజరు కావాలని ఆయన తెలిపారు. వార్డులలో డ్రైన్, నాళాలు గుర్తించాలని, చెత్త



సేకరణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. చెత్త సేకరణ కార్యక్రమలపై వార్డులలో ప్రజలకు మరొక్కసారి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు మరింత చేరువ కావడానికి సోషల్ మీడియాలతో ప్రచారం చేయాలని, చెత్త సేకరణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావడానికి, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులతో పాటు సంఘ సభ్యులు ర్యాలీలో ప్రతి సంఘం నుండి పాల్గొనేలా



చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ నరేష్, వికాస్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, వాణి, టిపిబిఒ దీపిక, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, మెప్మా సి. ఎల్.అర్పిలు జ్యోతి, మంజుల, సిబ్బంది రాజేందర్, కుమార్, ఉస్మాన్ పాషా, సంతోష్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు...!

- చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని.
- చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని వినతి



**కరపత్రం ప్రతినిది జమ్మికుంట : మే 31**
ఇటీవల నూతనంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పెండెం సర్వేశం తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం కావడం పట్ల ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు శనివారం సర్వేశం ను శాలువాతో ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సన్మాన కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ సలీం పాషా, మహమ్మద్ అక్బర్ పాషా, మహమ్మద్ ఫజలుల్ రెహమాన్,అంకుస్ లు పాల్గొన్నారు.

## నేషనల్ రోవింగ్ చాంపియన్ షిప్ పోటిల్లో చిప్ప దాత్రి కి గోల్డ్ మెడల్:



**కరపత్రం ప్రతినిది పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**
హైదరాబాద్ హుస్సేన్ సాగర్ వేదికగా ఈ నెల 27 నుండి 31 వరకు జరుగుతున్న 26వ, సబ్ జూనియర్ నేషనల్ రోవింగ్ చాంపియన్ షిప్ పోటిల్లో మాతంగి కాలనికి చెందిన చిప్ప దాత్రి అండర్ 13 విభాగం లో పోటీ పడి విజయం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకుంది. ఈ పోటీ ల్లో 23 రాష్ట్రాలనుండి 350 మంది పాల్గొన్నారు. అందులో తెలంగాణ నుండి 24 మంది పాల్గొన్నారు. హైదరాబాద్ డి ఏ వి పబ్లిక్ స్కూల్ లో 7వ, తరగతి చదువుతున్న ధాత్రి ని పలువురు అభినందనలు తెలుపుతున్నారు. తల్లి తండ్రులు చిప్ప నిరంజన్ శివ ప్రసాద్, తల్లి చిప్ప సుభాషిణి సంతోషం వ్యక్తం చేసారు.

# బోధన్ లో వ్యక్తి అదృశ్యం...



**కరపత్రం ప్రతినిధి బోధన్ మే 31..**
బోధన్ పట్టణంలో వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రాకాసిపేట్ కు చెందిన కడమల ప్రభాకర్ (57) శుక్రవారం ఉదయం 10:30 గంటలకు తన ఇంటినుండి తహసీల్దార్ కార్యాలయానికి వెళు_న్నానని చెప్పి వెళ్ళి మరల రాత్రి వరకు తిరిగి రాలేదని, అతని ఆచూకీ గురించి కుటుంబ సభ్యులు చుట్టూపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికిన ఎలాంటి ఆచూకీ లేకపోవడంతో అతని కుమారుడు భాను భూషణ్ శనివారం ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసినచో పట్టణ ఠాణా లో సమాచారం అందించాలన్నారు.

# ఘనంగా లోక మాత దేవి అహిల్యాబాయి జయంతి వేడుకలు...



**కరపత్రం ప్రతినిధి బోధన్ మే 31..**
నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో అహిల్యా బాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ లోకమాత దేవి అహిల్యాబాయి హెూల్కర్ జయంతి సందర్భంగా గ్రామంలోని కండోభ మందిరం వద్ద కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అహిల్యాబాయి మాల్వ రాష్ట్రాన్ని పాలించిన గొప్ప రాణి మాత్రమే కాకుండా, ధర్మవంతురాలు, ప్రజాహితైషి, గొప్ప దాతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆమె పాలనలో ప్రజలకు న్యాయం, సమానత్వం, అభివృద్ధి లభించాయన్నారు. ఆమె పుణ్య కార్యాల ద్వారా దేశవ్యాప్తంగా అనేక ఆలయాలను, ధర్మశాలలను, ఘాట్లను నిర్మించారని గుర్తు చేశారు. వారణాసిలో కాశీవిశ్వనాథ దేవాలయం పునఃనిర్మాణం ఆమె చేతుల మీదుగా జరిగిందనే విషయం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె జీవిత చరిత్ర మనకు ధైర్యం, నిస్వార్థ సేవా భావం, ధర్మబద్ధతకు నిదర్శనమని, ఇలాంటి మహానుభావురాల జయంతిని జరుపుకుంటూ, మనం కూడా ప్రజాసేవలో తలమునకలవ్వాలని సంకల్పిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షుడు సిరిగిరి రామ్, కార్యదర్శి సిరిగిరి గౌర్ గొండ సిరిగిరి అశోక్, సభ్యులు నాగ్ గొండా, శ్రీనివాస్, శివకాంత్, పీరాజీ, సుధాకర్, జలంధర్, మాధవరావు, సాయిలు ,ఈరు గొండ, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్టు...



**కరపత్రం ప్రతినిధి బోధన్ మే 31..**
బోధన్ పట్టణంలో పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణంలోని రాకాసిపేట్ లో గల లయన్స్ కంటి ఆసుపత్రి వెనుక దర్గా దగ్గర పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 5 గురిని పట్టుకొని వారి వద్దనుండి 1970రూపాయలు, 6 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# బిజెపిలో ఎప్పటికీ బిఆర్ఎస్ కలవదు

- విలీనం వార్తలు అన్నీ అసత్య ప్రచారాలే
- మాజీ స్పీకర్ మధుసూదనాచారి వెల్లడి

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
ఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలవబోతుందని కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారు. తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ పార్టీని పెట్టారు. కాంగ్రెస్, టీడీపీలకు ధీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగింది. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌ను కేసీఆర్ ఎదుర్కొన్నారు. తెలంగాణ సాధించి కేసీఆర్ సీఎం అయ్యి అభివృద్ధి చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రయోజ నాలను కాపాడవని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సీఎంగా లేనందుకు ప్రజలు బాధపడు తున్నారు. కేసీఆర్ పాలన చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీల రాజకీయ పునాదులు కదులుతాయి. పరిపాలనలో కాంగ్రెస్, బీజేపీ ప్రజల మెప్పు పొందాలి. కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉంది. కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ వేడుకలు జరుగుతాయి. కేసీఆర్ ఆలోచనలు నాకు తెలుసు. తెలంగాణ ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లో భంగం కలగదు. తెలంగాణ ప్రజలు ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటు-ంది. పార్టీలో ఏ నిర్ణయం అయినా కేసీఆర్ తీసుకుంటారు. జూన్ 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారు అని మధుసూదనాచారి తెలిపారు.

# 'భూభారతి' రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలి



- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...





**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు వీలుగా జూన్ 03 నుండి అన్ని మండలాలలో గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని నిబంధనల గురించి, దరఖాస్తులను పరిష్కరించాల్సిన తీరును తెలియజేశారు. ఇప్పటికే పైలెట్ ప్రాతిపాదికన జిల్లాలోని మెండోరా మండలంలో గల ఎనిమిది గ్రామాలలో రెవెన్యూ సదస్సులను జరిపి, క్షేత్రస్థాయి విచారణ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదే తరహాలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించాలని అన్నారు. జూన్ 03 నుండి 20 వ తేదీ లోపు రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటలకు సదస్సులు ప్రారంభం కావాలని, సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ రెవెన్యూ బృందాలు సకాలంలో గ్రామాలకు చేరుకోవాలని, సదస్సుల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఒకటి, రెండు రోజుల ముందే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే చోట తాగునీరు, సరిపడా నీడ, కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్ ఏర్పాటు చేయాలని, దరఖాస్తుదారులకు సహకరించేలా హెల్ప్ డెస్క్ ను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా దరఖాస్తులు దాఖలు చేసేలా చూడాలని, రిజిస్టర్లలో సమగ్ర వివరాలను నమోదు చేస్తూ, పూర్తి డాటాను కంప్యూటర్ ఆన్లైన్ లోనూ పొందుపర్చాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని హితవు పలికారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధనలపై పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించగల్గుతారని అన్నారు. ముందుగా డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులోని వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలని సూచించారు. అవకతవకలకు తావు కల్పిస్తే ప్రభుత్వ యంత్రాంగానికి, రెవెన్యూ వ్యవస్థకే చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హితవు పలికారు. కావాలని తప్పిదాలకు తావు కల్పిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని, సస్పెండ్ చెంసేందుకు కూడా వెనుకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున, ప్రతి దరఖాస్తును ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుందని, దరఖాస్తుదారుడు తిరిగి అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులతో కూడిన అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరు సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. సాదాబైనామాలు, పీ.ఓ.టీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణలు మాత్రమే జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన మీదట, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదాబైనామా, పీ.ఓ.టీలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకే దరఖాస్తులో ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే,ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరపాలని అన్నారు.అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,ఆర్డీఓలు రాజేంద్ర కుమార్,రాజాగౌడ్,అన్ని మండలాల తహసీల్దార్లు,నాయబ్ తహసీల్దార్లు,ఆర్ఐలు,సర్వేయర్లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి

- తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశం...






**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తహసీల్దార్లకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం తహశీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక సూచనలు చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో, లబ్దిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చే వారికి సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్దిదారులకు ఇసుకను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేకంగా జారీ చేసిన వే బిల్లులను అందించాలని,అనుమతుల విషయంలో అనవసర ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట ఇసుక పక్క దారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఎంపీడీఓలు, ఎంపీఓలను సంప్రదించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్దిదారులను నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ప్రారంభం అయితే వాగులు, నదులలో వరద జలాలు చేరుకొని ఇసుక లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వానలు కురియకముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు ముందస్తుగా సమకూర్చుకునేందుకు వారికి వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఎక్కడ కూడా ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయనే ఫిర్యాదులు రాకూడదని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,ఆర్డీఓలు రాజేంద్రకుమార్,రాజాగౌడ్ పాల్గొన్నారు.

# తమ భూమిని కబ్జా చేశారని ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారు

- భూకబ్జాదారునిపై చర్యలు తీసుకోవాలి...
- విలేకరుల సమావేశంలో బాధితుల ఆవేదన...




**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**
తమ భూమిని కబ్జా చేశారని ప్రశ్నిస్తే తమపై అట్రాసిటీ కేసులు బనాయిస్తూ దౌర్జన్యానికి దిగుతున్నారని బాధితులు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూమి యాజమాని సింహాద్రి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ తమకు నిజామాబాద్ జిల్లాలోని నవీపేట మండలం మద్దేపల్లి గ్రామ శివారులో 7 ఎకరాల 35 గుంటల భూమి మాకు ఉండేదని, మా భూమిని కాట్రోత్ రవికుమార్ అనే వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నారని బాధితుడు ఆరోపించాడు. మాభూమిలోకి వెళ్లి మేము పొలం వేసుకున్న మాకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వేసిన పొలాన్ని కోసుకొని మరీ అమ్ముకున్నారని, ఎవరైనా ఆయనను ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. మా భూమి సర్వే నెంబర్ 193,194,195,189,199 లో 5 ఎకరాల 17 గుంటలు భూమిని కట్రోత్ రవి, వాళ్ళ తండ్రి ని మేము 2005 వ సంవత్సరంలో అమ్మినామన్నారు. మిగిలిన 2 ఎకరాల 8 గంటల భూమిని ఆయన కబ్జా చేసుకున్నారని బాధితులు తెలిపారు. ధరణిలో ఎమ్మార్వోలు చేసిన తప్పుల వలన, మాకు ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు.మాపై అన్ని మీడియాలలో తప్పుడు కథనాలు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వార్తలను నమ్మద్దని, వాస్తవాలు చెప్పడానికే విలేకరుల ముందుకు వచ్చిన ట్లు తెలిపారు. నాకు జీవనాధారం ఈ భూమి తప్ప వేరే ఏమీ లేదని, అడ్డొస్తే మా పైన అట్రాసిటీ కేసులు పెట్టి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మా పరిస్థితులను చూసి మాకు న్యాయం చేసేలా చూడాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.